క్లుప్తంగా

తాత్కాలిక తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



సాయి ప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

గోపాలపురం: గోపాలపురం తహసీల్దార్ (ఎఫ్ ఏసీ)గా ఎంవీ సాయి ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డీటీగా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం (ఎఫ్ఏసీ) కొనసాగుతున్న కె.అజయ్‌బాబు గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయి ప్రసాద్‌ను ఏఎస్‌ఓ జె.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు హరీష్, నాగ సునీత, సర్వేయర్ రామతులసి, ఎలక్షన్ డీటీ కాట్రు నల్లరాజులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేత్రదానం చేసిన వృద్ధుడు



మద్దుకూరి అక్కయ్య (ఫైల్)

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామానికి చెందిన మద్దుకూరి అక్కయ్య (70) సోమవారం మృతి చెందారు. దింతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కుమారుడు సుబ్బారావు చౌదరి, కుమార్తె వెంకట లక్ష్మిలు నేత్ర దానానికి అంగీకరించడంతో నిడదవోలు రాజరాజేశ్వరి లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు ఆయన కార్నియాలను సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

144 సెక్షన్ అమలు

గోపాలపురం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఇరువర్గాల దాడుల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని గోపాలపురం ఎస్సై పి.మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరైనా నలుగురు వ్యక్తులు గుమిగూడటం, చర్చలు జరపడం వంటి పనులు చేయరాదని, రాత్రి సమయంలో పోలీసు గస్తీని మరింత ముమ్మరం చేసినట్లు తెలిపారు.

కార్మికుల సభను విజయవంతం చేయాలి

నిడదవోలు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సెప్టెంబర్ 14న నిడదవోలులో జరిగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాన్ని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు పామర్తి సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. కార్మిక సంఘాల నాయకులు మల్లిడి రామిరెడ్డి, కొమ్మోజు శేఖర్, గనిరాజు, ఎల్.గణపతి, రావి వరహాలస్వామి, గెద్దం రవీంద్ర, పాటంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

స్తంభించిన జన జీవనం

గోపాలపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని జనజీవనం స్తంభించింది. నిత్యం పనులు చేసుకొనే రోజువారీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు చలి గాలులకు వణికిపోతున్నారు. ఆకాశానికి చిల్లు పడిందా అన్న చందాన వర్షం కురుస్తుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బయటకు రావాలంటే ఇబ్బందులు గురవుతున్నారు. లోతట్టు ప్రాంతాలైన చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కొవ్వాడ కాలువ ఉధృతుంగా ప్రవహిస్తుంది. ఈ మేరకు చిట్యాల గ్రామంలో సోమవారం తహసీల్దార్ ఎంవీ సాయి ప్రసాద్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ముంపునకు గురైన వరి పొలాలను గుర్తించాల్సిందిగా మండల వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు.

తప్పుదారిపట్టిస్తే చర్యలు తప్పవు



పిట్టల వేమవరంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

పెరవలి: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులను ఎవరైనా తప్పుదారిపట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.నిరంజన్ సిబ్బందిని హెచ్చరించారు. మండల పరిధిలోని పిట్టల వేమవరం, ఖండవల్లి, ముక్కామల గ్రామాల సొసైటీల్లో ఎరువుల డిపోల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఉన్న నిల్వలను రైతులకు సక్రమంగా అందించాలని, అధిక ధరలకు అమ్మినా, బ్లాక్ చేసినా క్షమించేది లేదన్నారు. ప్రతి రోజు నిల్వలను రికార్డుల్లో చూపాలని ఎట్టి పరిస్థితుల్లో రికార్డుల్లో నమోదు చేయకపోతే ఆయా సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సొసైటీల సెక్రటరీలు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అతివృష్టి..అనావృష్టి

- భారీ వర్షాలతో జాగ్రత్తలు తప్పనిసరి
- ఏరువాక శాస్త్రవేత్తల పర్యటన
- పంట సాగుపై కీలక సూచనలు

తాళ్లపూడి: ఏమైంది అసలు ఈ వాతావరణానికి? ప్రస్తుతం అందరి మదిలో ప్రశ్న ఇదే. ఎండాకాలంలో ఆన్ చేసిన ఫ్యాను ఇంకా గిరగిరా తిరుగుతూనే ఉంది. నెల రోజుల కిందట వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడ్డా రైతులు, గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో కుదేలవుతున్నారు. పలు చోట్ల పంట నీట మునగడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పంట సాగు చేసేందుకు సాహసం చేయడం లేదు. దీని కారణంగా సంచి పట్టుకుని మార్కెట్‌కు వెళ్తే కూరగాయల ధరతో సామాన్యుడికి ఊపిరి ఆడడంలేదు. అర్థం కాకుండా ఉన్న వాతావరణం రైతులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికంగా ప్రభావం చూపుతోంది.

నియోజకవర్గంలో పరిస్థితి..

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన ఎక్కువవుతోంది. అప్పులు చేసి వేసిన పంటలు చేతికి వస్తాయా? రావా? అనే సందేహం కలుగుతోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో 24 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా, భారీ వర్షాలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పెట్టుబడి పెట్టి, కష్టపడి సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోవడం, తెగుళ్లు ఆశించడం వంటి సమస్యలు వారిని నిరాశలోకి నెడుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రధానంగా వరి, వాణిజ్య పంటలు, కూరగాయలు, వంటి ప్రధాన పంటలకు ఈ వర్షాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి.

రైతులకు అవగాహన

ఈ నేపథ్యంలో మండల పరిధిలోని పంటల పరిస్థితిని తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహ రావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, మారుటేరు శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్‌లు సోమవారం పర్యటించారు. ఈ మేరకు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. డాక్టర్ నరసింహ రావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షపాతం సాధారణ స్థితిలోనే ఉందని, ఎక్కడా పంట నీట మునగలేదన్నారు. ప్రస్తుతుం కురుస్తున్న ఈ వర్షాలు పంట ఎదుగుదలకు మరింత దోహదం చేయడమే కాక, కొన్ని ఆకు ముడత, ఆకు నల్లి పురుగులు ఈ వర్షాలకు కొట్టుకు పోయాయన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఒకవేళ తాత్కాలికంగా ముంపునకు గురయినప్పటికీ, వెంటనే నీరు బయటకు పోయే పరిస్థితులు ఉన్నాయన్నారు.

వరి సాగు జాగ్రత్తలు..

అధిక వర్షాలు కురుస్తున్న సమయంలో వరి నాట్లు వేయడం, వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయకూడదు. ఇప్పటివరకు వరి నాట్లు వేసిన రైతులు వర్షపు నీటిని తొలగించి పొలాన్ని ఆరనివ్వాలి. ముంపునకు గురైన పొలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం కలిగితే పొలంలో తగినంత గాలి వచ్చే విధంగా నెర్రలు వచ్చే వరకు పొలాన్ని ఆరనివ్వాలి. 25–30 రోజుల వయసున్న వరి నారును ఆగస్టు చివరి వరకు వర్షాలు తగ్గిన తర్వాత కూడా నాట్లు నాటుకోవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయు 1,318, పీఎల్‌ఏ 1,100, ఎంటీయు 1,262, స్వర్ణ సంపద, ఎంటీయు 1,061, ఎంటీయు 1,064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. పంట నాటిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోతే మనియాదలు చేసుకోవాలి. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత్త త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ అదనంగా పిచికారీ చేయాలి.

పిలకల దశలో మునిగితే..

ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు, లీటరు నీటికి 1.0 గ్రా. కార్బెన్డిజిమ్ లేదా 2.0 గ్రా కార్బెన్డిజిమ్ , మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. అదే ముంపును తట్టుకునే ఎంటీయు 1,318, ఎంటీయు 1,064, పీఎల్ఏ 1,100 వంటి రకాలు వారం రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. ఆకులు పైకి కనిపిస్తూ 30–40 సెంటీమీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతల్లోని మధ్యస్థ ముంపుని కూడా తట్టుకుంటాయి. ఎంటీయు 1,232 రకం అయితే 10–12 రోజుల పాటు తాత్కాలిక ముంపును సైతం తట్టుకుంటుంది.



నల్లజర్ల మండలంలో వర్షాలకు నీటమునిగిన వరి పొలాలు

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసం–పీజీఆర్ఎస్ వేదికలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత సూచించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆమె స్వయంగా స్వీకరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ మీ కోసంలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అధికారుల సమన్వయంతో వేగంగా పరిష్కరించేందుకు ప్రతివారం రెండు రోజులు శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్య పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదులు ఇలా..

- కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన నీరుకొండ వీర వెంకట సత్యనారాయణ గ్రామంలోని మూడో వార్డులో వీధి లైట్లు వెలగడం లేదని, మరమ్మతులు చేయాలని అర్జీ సమర్పించారు.
- తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన కొప్పాక జయహర్ విజయానంద కుమార్ గ్రామంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నామని అర్జీ సమర్పించారు.



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో

వరద నీటిలో వేంకటేశ్వరస్వామి ఆలయం



వేంకటేశ్వర స్వామి, సాయిబాబా ఆలయం చుట్టూ నిలిచిన వర్షపు నీరు

తాళ్లపూడి: తాళ్లపూడి మండల వ్యాప్తంగా అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. మండలంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పలు గ్రామాలోని సీసీ రోడ్లు, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వేగేశ్వరపురంలోని వెంకటేశ్వర స్వామి, సాయిబాబా ఆలయం చుట్టూ, ఆలయం వెనుక వీధిలో నీరు బయటకు వెళ్లడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో అర్చకులు గృహాలు వద్ద, యానాధుల కాలనీలో నీరు పారక దుర్గంధం వెదజల్లుతుంది. గత 2014–2019 టీడీపీ ప్రభుత్వంలో డ్రెయినేజీ అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో నేటి పరిస్థితికి అద్దం పడుతోందని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆరోపిస్తున్నారు. నీరు–చెట్టు నిధులతో కోనేరు (చెరువు) అధునీకరణ పేరుతో పనులను చేపట్టి అసంపూర్తిగా వదిలేశారన్నారు. నిధులు లేక ఇబ్బందిగా మారిందని, కల్వర్టులు నిర్మిస్తే గాని సమస్య పరిష్కారం కాదని సర్పంచ్ వాపోయారు.



తాళ్లపూడిలోని మెయిన్‌రోడ్డులో గోతుల్లో నిలిచిపోయిన నీరు


ఆరుతడితో రైతులకు మేలు



ముక్కామలలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న తాతారావు

పెరవలి: ఆరుతడి వ్యవసాయంతో మీథేన్ ప్రభావం 50 శాతం పైగా తగ్గుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బొర్రా తాతారావు తెలిపారు. పెరవలి మండలంలో సోమవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముక్కామల, ముత్యాలవారిపాలెం, తీపర్రు గ్రామాల్లో ఆరుతడి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో 45 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయటానికి రైతులు ముందుకు వచ్చారని వీరందరితో ఆరుతడి వ్యవసాయం చేయటానికి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ సాగులో నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ, మిథేన్ ప్రభావాన్ని తగ్గించటమే లక్ష్యమన్నారు. మిథేన్ ఎక్కువైతే భూతాపం పెరిగి సరైన సమయంలో వర్షాలు కురవకుండా నిత్యం భూతాపం వలన వేడుగాలులు వీస్తాయన్నారు. జిల్లాలో 30 డ్రోన్‌ల సహాయంతో ఎకరానికి మందులు పిచికారీ చేసినందుకు రూ.300లు, కషాయాలకు రూ200 చొప్పున రూ. 500లు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీపర్రు సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి మహాలక్ష్మి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షపాతం నమోదు



బ్రాహ్మణగూడెం వద్ద రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

చాగల్లు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ మేరకు ఆదివారం నుంచి సోమవారం వరకు 17.8 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. కుండపోతగా కురుస్తున్న వర్షానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో చెరువులు, డ్రైయిన్లలో నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నిడదవోలు–పంగిడి రహదారిలో గోతుల కారణంగా బ్రాహ్మణగూడెం వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, దారవరం, చంద్రవరం తదితర పల్లపు ప్రాంతాల్లోని పొలల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గోపాలపురం: వరుస అల్పపీడనల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎలక్ట్రికల్ ఏడీఈ పి రవిశంకర్ సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. ఇంటి గృహోపకరణాలు స్విచ్ ఆఫ్ మోడ్‌లో ఉంచాలని, తడి చేతులతో స్విచ్‌లు ఆన్‌చేయరాదని, ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వెంటనే సబ్‌స్టేషన్, లేదా సమీప లైన్‌మెన్, ఎల్ఐ, ఏఈలకు తెలియజేయాలని సూచించారు. ఇంటి ఆవరణలో ఉన్న మోటార్లు, విద్యుత్ కనక్షన్‌లను పరిశీలించిన తర్వాత మాత్రమే ఉపయోగించాలన్నారు. వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ సమస్య ఉత్పన్నమైన వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని ఏడీఈ కోరారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చాగల్లు: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయాధికారి కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.సేంద్రియ ఎరువుల వాడకం వలన పంటదిగుబడులను పెంచుతుందని, నెలసారన్ని కాపాడు కొవచ్చునని వివరించారు. సూక్ష్మ పోషకాలను రాయితీపై అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రాట ముహూర్తం

నిడదవోలు: స్థానిక యాదవుల వీధిలో గణపతి నవరాత్రుల 11 వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాట ముహూర్తం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముహూర్తం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్లు గంగుల వెంకటలక్ష్మి, కారింకి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వుల రతిదేవి, ఉసురుమర్తి జాన్‌బాబు, చిలకల శారదాదేవి అరుగోళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- మట్టి గణపతులకే కమిటీల ప్రాధాన్యం
- ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం

నల్లజర్ల: ఆదిపూజల దేవుడు, విఘ్నాధిపతి ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదిన వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు పల్లెల్లో పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీలు పర్యావణానికి హాని కలగని మట్టి గణపయ్యల ఏర్పాటుకే ప్రాధాన్యతనిస్తుండటం గమనార్హం. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. నల్లజర్లలో ఇండియన్ బ్యాంకు పక్కన రాజస్థాన్ కళాకారులు వినూత్న ఆకృతులతో గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు. ఆయా మండపాల నిర్వాహకులు ఇప్పటికే తయారీదారులకు అడ్వాన్సులు చెల్లించి విగ్రహాల తయారీ చేయిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారుడు సోహన్‌లాల్ మాట్లాడుతూ రెండు నెలల ముందు నుంచే ఇక్కడ విగ్రహాలు తయారీ ప్రారంభించామన్నారు. మా వద్ద ప్రస్తుతం చౌక్‌మట్టితో తయారు చేసిన 200 విగ్రహాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆకృతి సైజును బట్టి రూ.5వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయిస్తున్నాం. వివిధ ప్రాంతాలకు చెందిన ఉత్సవ కమిటీలు అడ్వాన్సులు చెల్లించడంతో వారికి నచ్చిన ఆకృతిలో విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నామన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

నూతన ఆవిష్కరణలతో ఉద్యోగ అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కృష్ణమూర్తి



కళాశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

నల్లజర్ల: ఇంజినీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగితే అద్భుతమైన అవకాశాలు లభిస్తాయని వైజ్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ప్రముఖ వ్యాపావేత్త నంద్యాల కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు అరవింద కుమార్ అధ్యక్షతన సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగాలలో వస్తున్న మార్పులను గమనిస్తూ నూతన ఆలోచనలు చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని సేవలకు సాంకేతిక పరిజ్ఞానం తోడవ్వడంతో ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. విద్యార్థుల ఉన్నతికి అవసరమైన విద్యావిధానాన్ని కళాశాల సమకూరుస్తుందన్నారు హెచ్ఓడీలు, సీనియర్ విద్యార్థులు తమ మనోభావాలను మొదటి ఏడాది విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టరు ఏయస్ ప్రసాద్, డాక్టర్ అమరావతి, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పేదలకు మరిన్ని సేవలు అందించాలి



డాక్టర్ సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెరవలి: ప్రజలకు సేవ చేయటంలో ఉన్న ఆనందం, సంతృప్తి మరెక్కడ ఉండదని నమ్మిన ఆ దంపతులకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా అవార్డు పొందటంతో మరింత ప్రొత్సాహన్ని అందిస్తుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న అద్దాల సత్యనారాయణ దంపతులను సోమవారం ఖండవల్లిలో పెరవలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 27 ఏళ్లుగా వృత్తి రీత్యా దంత వైద్యం చేస్తున్నా, పేదలకు సేవ చేయలనే ధ్యేయంతో, వృతితో పాటు ప్రస్తుతం కాకినాడ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారని, ఆయనకు తోడుగా సతీమణి జానకీ రమ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెశిడెంట్ కోలా సీతయ్యనాయుడు, సలాద ఉదయభాస్కరరావు, గాదిరాజు చంటిరాజు, యాతం రామ్మకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

దేవరపల్లి: గోల్కొండ కోటను ఏలిన ధీరుడిగా చరిత్రకెక్కిన హైందవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బంధపురం గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో సంఘం ప్రతినిధులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటంతో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.